www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 1 జనవరి 2025



2 నుంచి యోగా బ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి- కడప అర్బన్: పటేల్ రోడ్డులో ఉన్న మిత్ర యోగా సెంటర్‌లో 30 రోజుల పాటు నిర్వహించే యోగా శిక్షణ కొత్త బ్యాచ్‌ను ఈనెల 2 నుంచి ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ కల్పన, డాక్టర్ రంగనాథరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ లో రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. అధిక బిపి, డయాబెటిస్, ఒబేసిటీ వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు వీలవుతుందని పేర్కొన్నారు. ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవసరమైన యోగాసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, షట్ క్రియలు, ధ్యానం వంటి యోగ ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామని తెలిపారు. ఈ శిక్షణ ఉదయం 5.45 గంటల నుంచి 7.00 గంటల వరకు మొదటి బ్యాచ్, ఉదయం 8.30 గంటల నుంచి 10 వరకు మహిళలకు రెండో బ్యాచ్, సాయంత్రం 5.30 నుంచి 6.30 వరకు మూడవ బ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు.వివరాలకు 9848861206, 701323898 6లలో సంప్రదించాలన్నారు.



- కొప్పర్తి మహర్దశపై అందరి చూపు
- ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపైనే ఆశలు



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కొత్త ఏడాది కోటి ఆశలతో పలకరిస్తోంది. 2024 కరువు బారిన పడినప్పటికీ నూతన సంవత్సరం గంపెడు ఆశలను రేకెత్తిస్తోంది. 2025 స్థానిక సంస్థల ఎన్నికలు స్వాగతం పలుకుతున్న తరుణంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్‌సిక్స్ హామీలపై ప్రజానీకం ఆశలు పెంచుకుంది. 2025 నూతన సంవత్సరంలో కొత్త లక్ష్యాలతో ల్యాండ్‌మార్క్‌గా నిలవనుంది. ఎవరికి వారు నిర్దేశిత లక్ష్యాలను అధిగమించడానికి ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు. జిల్లాలో ప్రభుత్వమే ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు నడుంబిగించినప్పటికీ ప్రయివేటు భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తామనే హామీ ఆచరణలో అడుగు ముందుకు పడడం లేదు. కొత్త సంవత్సరం కొత్త ఆశలు రేపుతోంది. ప్రభుత్వం రైతాంగ ఆకాంక్షలను అధిగమించి దానికి తగిన ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నప్పటికీ ఉసురు తీసుకున్న రైతులకు పరిహారం పెంచినప్పటికీ ఆశించిన ప్రయోజనం నెరవేరడం లేదు. తాజాగా సింహాద్రిపురం మండలానికి చెందిన ఓ రైతు కుటుంబం ఆత్మహత్య చేసుకోవడం వ్యవసాయ రంగం సంక్షోభానికి నిదర్శనం. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు మొదలుకుని సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్ సమస్య వేధిస్తోంది. ఫలితంగా గండికోట, పైడిపాలెం, చిత్రావతి ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయిలో నీళ్లను నిల్వ చేసినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది.

జిల్లా ప్రగతి తిరోగమనంలో సాగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కొప్పర్తిలో ఎంఎస్ఎంఇ, ఎలక్ట్రానిక్స్ కోర్సు తరలింపు వంటి చేష్టలతో ప్రజల్లో నిరుత్సాహం నెలకొంది. ఇటువంటి తిరోగమన వాతావరణాన్ని మార్చాల్సి ఉంది. ఇటీవల కేంద్రం కొప్పర్తిని పారిశ్రామిక, స్మార్ట్‌సిటీగా అభివృద్ధి ప్రాజెక్టులకు ఎంపిక చేసిన వాతావరణంలో కొత్త ఆశలు రేకెత్తిన సంగతి తెలిసిందే. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, రాజోలి, జోలదరాశి, కుందూ లిఫ్టు, జిఎన్ఎస్ఎస్-2 నుంచి కాలేటివాగు లిఫ్టు మొదలగు పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. జిజిహెచ్ సూపర్‌స్పెషాలిటీ పూర్తి స్థాయిలో పనిచేయడం లేదు. కడప, పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలల్లో ఫ్యాకల్టీ నియామకాలు, జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులు, అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ; ఒంటిమిట్ట కోదండరామాలయ మాస్టర్ ప్లాన్ వంటి అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. 2014 రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విధంగా కేంద్ర ప్రభుత్వం సెయిల్ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాల్సి ఉంది. కేంద్రం మొండివైఖరిని అవలంభించడంతో 2018 నుంచి 2024 వరకు టిడిపి, వైసిపి సర్కార్లు శంకుస్థాపన చేయడం తెలిసిందే. కొప్పర్తి పారిశ్రామికవాడకు పర్యావరణ అనుమతి కొరవడిన నేపథ్యంలో పారిశ్రామిక ప్రగతి పడకేసింది. రూ.150 కోట్లతో బ్రహ్మసాగర్ నుంచి కొప్పర్తికి నీటి సరఫరా పైప్‌లైన్ ప్రతిపాదనలు సాకారానికి నోచుకోవడం లేదు. ఫలితంగా వేలాది మంది నిరుద్యోగులు పొట్ట చేతబట్టుకుని గల్ఫ్ దేశాలకు వలసవెళ్తున్నారు. గండికోట, జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2, తెలుగుగంగ కాల్వల వెడల్పు పనులు, అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ పనులు, జిఎన్ఎస్ఎస్-2 పనులు మొదలుకుని, ఉమ్మడి జిల్లాలోని 15 రిజర్వాయర్ల పరిధిలో ఏ ఒక్క ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు నీరందించే పరిస్థితి కనిపించడం లేదు. ఈ ఏడాది గండికోట, మైలవరం, పైడిపాలెం, చిత్రావతి ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేసిన సంగతి తెలిసిందే. సర్వారాయసాగర్, బ్రహ్మసాగర్ రిజర్వాయర్ లీకేజీ మరమ్మతులు ఎప్పటికి సాకారమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. గండికోట, సోమశిల, పైడిపాలెం ప్రాజెక్టుల పరిధిలోని నిర్వాసితులకు పెండింగ్ పరిహారం సమస్య వేధిస్తూనే ఉంది. ఈఏడాది స్థానిక సమరం సాగే సమయానికి సాగునీటి ప్రాజెక్టుల పరిధిలోని నిర్వాసితులకు పెండింగ్ పరిహారం విడుదల, కొప్పర్తి పారిశ్రామికవాడ, జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులకు పర్యావరణ అనుమతులు సాధించడంపై ప్రజానీకం ఆశలు పెంచుకుంది.

రైతు ఆలోచనా విధానంలో మార్పు రావాలి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప

వ్యవసాయంలో నవ శకానికి నాంది పలకాలంటే రైతు ఆలోచనా విధానంలో మార్పు రావాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఫైనాన్స్ స్కేల్ ఫిక్సేషన్, ప్రతిపాదనలపై డిస్ట్రిక్ట్ లెవెల్ టెక్నికల్ కమిటీ సమావేశం నిర్వహించారు. వ్యవసాయ సుస్థిర అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ చైర్మన్, కలెక్టర్ బ్యాంకు అధికారులు, రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ లెవెల్ టెక్నికల్ కమిటీ సమావేశంలో సమీక్షించిన అంశాలను, ప్రతిపాదనలను స్టేట్ లెవెల్ కమిటీకి నివేదిస్తామన్నారు. వ్యవసాయాన్ని కూడా ఒక పరిశ్రమగా గుర్తించి.. రైతుల సృజనాత్మకతకు, వారు వాడే పనిముట్లు, మోటార్లు తదితర వాటి నిర్వహణ ఖర్చులతో కలిపి కూడా రుణాలు అందించేలా రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ముఖ్యంగా వ్యవసాయంలో సుస్థిర అభివృద్ధిని సాధించేందుకు రైతులు అధునాతన పద్ధతులను, శాస్త్రీయ మెలకువలను పాటించాలన్నారు. పంటల మార్పిడి విధానాన్ని అవలంభించాలని, ఉద్యాన పంటల సాగును అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం డిసిసిబి వారు ప్రచురించిన 2025 సంవత్సర క్యాలెండర్లు, డైరీలను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎల్‌డిఎం జనార్ధనం, నాబార్డ్ ఎజిఎం విజయ విహారి, కెడిసిసి సిఇఒ రాజమ్మ, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ శారదమ్మ, వసాయ అనుబంధశాఖల అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్నకలెక్టర్

విద్యుత్ ఉద్యోగులకు సంఘీభావంగా నిరసన

- యుఇఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

యుపి, చండీఘర్ రాష్ట్రాలలో విద్యుత్ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని యుఇఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కడప విద్యుత్ భవన్ వద్ద చండీఘర్, యూపిలలో ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ అండ్ ఇంజినీర్స్ పిలుపులో భాగంగా యుఇఇయు, డిస్కం నాయకుల మద్దతుతో పోరాడుతున్న కార్మిక, ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. విద్యుత్ సంస్థల ప్రయివేటీకరణ విధానాలను ఆపాలని చెప్పారు. రెండు రాష్ట్రాలలో దాదాపు 1.50 లక్షల మందికి పైగా ఉన్న ఉద్యోగ, కార్మికుల పై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. అందులో 70 వేలకు పైగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు ఉన్నారని తెలిపారు. విద్యుత్ సంస్థలను ప్రయివేటీకరణ వైపు తీసుకెళ్లే విధానాలను దేశంలోని కార్మిక, ఉద్యోగులు ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. డిస్కం అధ్యక్షులు శివశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగాలను కాపాడుకోవాలని, తద్వారా కార్మిక హక్కులకు రక్షణ, సమస్యలను సాధించుకోగలమని చెప్పారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ రంగాల పరిరక్షణకు, కార్మిక, ఉద్యోగుల హక్కులకు కోసం చేపట్టే పోరాటాలకు సిఐటియు అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపి, సురేంద్ర, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లాలో కేంద్ర మంత్రి పర్యటన

ప్రజాశక్తి - కడప : మూడు రోజుల పాటు జిల్లాలో పలు కార్యక్రమాల్లో కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పర్యటించనున్నారని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో ఈనెల1 నుండి 3 వరకు జిల్లాలో పర్యటించనున్న కేంద్ర శాస్త్ర సాంకేతిక, భౌగోళిక శాస్త్ర శాఖ మంత్రి డా. జితేంద్ర సింగ్ పర్యటన కార్యక్రమాల నిర్వహణపై కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆకాంక్ష జిల్లాల లక్ష్య సాధనలో భాగంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించేందుకు జిల్లాకు వస్తున్న కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ పర్యటనా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేయాలన్నారు. పర్యటనలో భాగంగా 1వ తేదీ రాత్రి జిల్లాకు చేరుకుని, 2వ తేదీ ఉదయం సికె దిన్నె, జమ్మలమడుగు మండలాల్లో క్షేత్రస్థాయిలో ప్రగతిని ఆయన పరిశీలిస్తారన్నారు. 3న ఉదయం పర్యటన ముగించుకుని తిరిగి వెళతారన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ విశ్వేశ్వరనాయుడు, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, కడప, జమ్మలమడుగు ఆర్‌డిఒలు జాన్ఇర్విన్, సాయిశ్రీ, కెఎంసి కమిషనర్ మనోజ్‌రెడ్డి, వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యా శాఖల అధికారులు నాగేశ్వరరావు, డాక్టర్ నాగరాజు, మీనాక్షి, ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, సంక్షేమ అనుబంధ శాఖల అధికారులు, మార్కెటింగ్, బ్యాంకింగ్, అనుబంధ శాఖల అధికారులు హాజరయ్యారు.

ఇ-పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి- కమలాపురం టౌన్ : ఇ- పంట నమోదు తప్పని సరి అని మండల వ్యవసాయాధికారి ఎం. సరస్వతి పేర్కొన్నారు. కమలాపురం మండలం ఎర్రగుడిపాడు, దేవరాజుపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి అధిక దిగుబడులను సాధించాలని రైతులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే వివిధ ద్రావణాలు, కషాయాలను వాటి తయారీని వివరించారు. చీడపీడ నివారణలకు నీమాస్త్రం బ్రహ్మాస్త్రం, అ గ్నస్త్రం, తూటి కాడ కషాయం వంటివి వాడడం వల్ల రసం పీల్చే పురుగులు, కాయ కొమ్మ తెలిచే పురుగులు, కత్తెర పురుగులు నివారణకు దోహదపడతాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో శనగ పంటను పరిశీలించారు. క్రాప్ ఇన్సూరెన్స్ చేసుకున్న ప్రతి రైతు ఇ- పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

విసిని కలిసిన పాలక మండలి సభ్యులు

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు విద్యాలయ విసి ఆచార్య కె. కృష్ణారెడ్డిని కలిశారు. విసిగా నియమితులయ్యాక తొలిసారిగా వారు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విశ్వ విద్యాలయ అభివృద్ధి పై చర్చించారు. వైవీయూను పూర్వ అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు మీ సహకారం కావాలని కోరారు. అనంతరం విసిని సత్కరించారు. పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, ప్రొఫెసర్ పి.చంద్రమతి శంకర్, జె.వెంకట లక్ష్మి, కె.చిన్న సుబ్బారావు, ప్రొఫెసర్ ఎం.మల్లికార్జున రెడ్డి, పి.ముబీనా బేగం, విద్యాసాధన విద్యా సంస్థల అధిపతి అక్బర్ ఖాన్ పాల్గొన్నారు.

సాయిబాబా విద్యా సంస్థల్లో
నూతన సంవత్సర సంబరాలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని అక్కాయపల్లెలో ఉన్న సాయిబాబా విద్యాసంస్థల్లో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థల వైస్ చైర్మన్ ఎం.వి. సాయి సుధీర్ కుమార్‌రెడ్డి విద్యార్థులతో కలిసి పాఠశాలలు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో విద్యార్థులు అన్ని రంగాల రాణించాలని పిలుపునిచ్చారు. ఉత్తమ లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న వైస్ చైర్మన్ సాయి సుధీర్ కుమార్‌రెడ్డి

నూతన సంవత్సరంలో
ఆనందంగా గడుపుదాం : జెవివి

ప్రజాశక్తి - కడప అర్బన్

కొత్త సంవత్సరాన్ని మద్యం లేకుండా ఆనందంగా గడపాలని జన విజ్ఞాన వేదిక నాయకులు రాజశేఖర్ రాహుల్, వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులతో 'కొత్త సంవత్సరం మందు లేకుండా గడిపి కుటుంబమంతా ఆనందంగా ఉండాలని' ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సంవత్సరం శుభాలను తెస్తుందని ఆశించడంలో తప్పులేదని పేర్కొన్నారు. అర్ధరాత్రి తర్వాత ఉన్మాదంతో చెవులు పడేలా అరుపులు! మద్యం మత్తులో చిందులు కొత్త సంవత్సరానికి స్వాగతం చెప్పే పద్ధతి ఇదేనా అన్నారు. దీనివల్ల మద్యం వ్యాపారుల జేబులు నిండడం, మధ్యతరగతి జిల్లా జేబులు ఖాళీ అవుతాయని తెలిపారు. ఈ కొత్త సంవత్సరం సందర్భంగా మీ జీవితంలో మీ కన్న వాళ్ళు గర్వపడే మంచి పని నుంచి శ్రీకారం చుట్టాలని కోరారు. డిసెంబర్ 31 పేరు చెప్పి వృధాగా ఖర్చు పెట్టే డబ్బులు మీ బిడ్డల చదువుల కోసం, వారి భవిష్యత్తు కోసం అండగా ఉండాలని కోరారు. ఆ ఒక్కరోజు మీ కుటుంబ సభ్యులతో కలిసి చేసుకోండని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కడప సిటీ జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి మధుసూదన్, ఉపాధ్యాయులు సువర్ణలత, సుష్మ, వెంకటసుబ్బయ్య, గౌతమి, శ్రీనివాసరాజు హాజరయ్యారు.

'నాగార్జున'లో స్పోర్ట్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - కడప అర్బన్



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న విద్యార్థులు

నగరంలోని రామరాజుపల్లె లో ఉన్న నాగార్జున మోడల్ స్కూల్లో మంగళవారం స్పోర్ట్స్ స్ప్రెక్టా పేరుతో క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూలు చైర్మన్ ఎం. శివశంకర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని, డైరెక్టర్ శ్రీదేవి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. ఒలంపిక్ తరహాలో క్రీడాజ్యోతిని వెలిగించారు. జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులు జ్యోతిని ముఖ్య అతిథులకు అందజేశారు. స్పోర్ట్స్ డే ప్రారంభ సూచికగా చైర్మన్, డైరెక్టర్, ప్రిన్సిపల్స్ తెల్ల పావురాలను గాలిలోకి ఎగురవేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి క్రీడలు దోహదపడతాయని పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలో విద్యతో పటు క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తి, నాయకత్వం, సమయపాలన వంటి లక్షణాలు అలవాడాలంటే క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు. శారీరక దృఢత్వంతోనే మానసిక స్థిరత్వం ఏర్పడుతుందని చెప్పారు. విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకే ప్రతి ఏడాది క్రీడా దినోత్సవం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తల్లిదండ్రుల సహకారంతో నిరాటంకంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడా పోటీల్లో విజేతలను సత్కరించారు. చిన్నారులు వివిధ క్రీడా దుస్తులను ధరించి మన జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులైన పి.వి.సింధు, నీరజ్ చోప్రా గ్రూపులతో మార్చ్ ఫాస్ట్ చేస్తూ ముఖ్య అతిధులకు గౌరవ వందనం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

సైన్స్ ఫెయిర్ విద్యార్థులకు ఉపయోగకరం : డిఇఒ

ప్రజాశక్తి - కడప అర్బన్



బహుమతి అందజేస్తున్న డిఇఒ

విద్యార్థుల ప్రతిభకు సైన్స్ ఫెయిర్ ఎంతగానో ఉపయోగకరమని డిఇఒ మీనాక్షి అన్నారు. మంగళవారం నగరంలోని బిల్టప్ సర్కిల్ దగ్గర ఉన్న దారుస్సలాం ఇస్లామిక్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో సైన్స్ ఫెయిర్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌లలో పాల్గొని తమ మేధో శక్తిని పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు అద్భుతంగా తమ ప్రతిభతో ఉత్తమ ప్రయోగాలు చేయడం ప్రశంసనీయమన్నారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ ఇమాన్యుల్ విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను తిలకించారు. అనంతరం విద్యార్థులకు డిఇఒ బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ మొహమ్మద్, దస్తగిరి, ప్రిన్సిపల్ నిస్సార్ అహ్మద్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ షేక్.మొహమ్మద్ రిజ్వాన్, పలువురు ప్రముఖులు, ఉపాధ్యాయులు, స్కూల్ స్టాఫ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉంటాం

- ఎంపిడిఒను పరామర్శించిన 'మండిపల్లి'

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉంటామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. వైసిపి నాయకులు సుదర్శన్‌రెడ్డి దాడిలో గాయపడి కడప రిమ్స్ హాస్పిటల్ ఐసియులో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపిడిఒ జవహర్‌బాబును మంగళవారం రాజంపేట టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు, కడప జిల్లా జడ్‌పి సిఇఒ ఓబులమ్మతో పరామర్శించారు. ఈ సందర్భంగా వారు ఎంపిడిఒకు ధైర్యం చెప్పి వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసిపి నాయకులకు వ్యవస్థలు, అధికారులు అంటే లెక్క లేదని చెప్పారు. ఒక దళిత ఎంపిడిఒ విధుల్లో ఉండగా నిబంధనలకు విరుద్ధంగా సహకరించలేదని ఉద్దేశంతో భౌతిక దాడి చేయడం అత్యంత దారుణమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ఇలా ప్రవర్తిస్తున్నారంటే అధికారంలో ఉన్నప్పుడు ఎంతమంది అధికారులను ఎన్ని బాధలు పెట్టి ఉంటారో అర్థం చేసుకోవాలని తెలిపారు. అధికారులపై దాడి చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలే ప్రసక్తే లేదని చెప్పారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు పొడిగింపు

ప్రజాశక్తి - కడప : రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగిసిన నేపథ్యంల జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని రెండు నెలలు పాటు జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28, వరకు పొడిగించినట్లు కడప సమాచార శాఖ డిఐపిఆర్ఒ వేణుగోపాల్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు జిల్లాలో ప్రస్తుతం డిసెంబర్ 31, 2024 నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి పనిచేయుచున్న పాత్రికేయులకు మాత్రమే పొడిగింపు సౌకర్యం కొనసాగుతుందని పేర్కొన్నారు. సంబంధిత మీడియా యాజమాన్యం వారి సంస్థలో పని చేస్తున్న, తొలగించిన జర్నలిస్టుల వివరాలు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి, కడప వారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

సమస్యలను డిఎల్ఎస్ఎ దృష్టికి తీసుకురండి : జడ్జి

ప్రజాశక్తి - కడప : ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి తీసుకు రావాలని సీని యర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగ ళవారం కడప నగరం లోని ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరి శీలన గృహం, హాస్టల్‌ను జడ్జి సంద ర్శించారు. పిల్లలు ఏయే తరగతులను అభ్యసిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు, తరగతి గదులను, వంటశాలను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024 వివరించారు. విద్య విలువైందని, క్రమశిక్షణతో అభ్యసించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి, పిల్లల విద్యా ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వీరయ్య, వైద్యాధికారి, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి -కడప అర్బన్

పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా కడప ఉమ్మడి జిల్లాకు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు నగర శివార్లలోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం (డిటిసి) లో దేహ దారుఢ్య పరీక్షలు రెండో రోజు మంగళవారం కొనసాగాయి. పరీక్షలను ఎస్పి విద్యాసాగర్‌నాయుడు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమి నరీ పరీక్షను పూర్తి చేసిన అభ్యర్థులకు ఫిజికల్ మెజర్‌మెంట్, ఫిజికల్ ఎఫిషి యన్సి పరీక్షలు ప్రారంభమయ్యాయన్నారు. జిల్లాలో 4,492 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారన్నారు. రోజూ 6 వందల మంది అభ్యర్థులు పాల్గొంటారని, ఇం దుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం గా ఉంచామన్నారు. రోజూ అభ్య ర్థులకు మొదటగా సర్టిఫికెట్స్ పరిశీలన, ఎత్తు, ఛాతీ వంటి ఫిజికల్ మెజర్ మెంట్స్ చేస్తారని చెప్పారు. తర్వాత బయోమెట్రిక్ తీసుకుంటారు. పరీక్షలలో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. దేహ దారుఢ్య పరీక్షల దగ్గర ఎక్కడ కూడా ఎలాంటి ఆరోపణలు, పొరపాట్లకు తావు లేకుండా ఆధునిక ఆర్ఎఫ్ఐడి కం ప్యూటరైజ్డ్ టెక్నాలజీతో పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. డిజి టల్‌గా, పార దర్శకంగా ఈవెంట్స్ నిర్వహి స్తున్నా మన్నారు. దేహదారుఢ్య పరీక్షలకు హాజ రయ్యే అభ్య ర్థులు వెరిఫికేషన్ కోసం కచ్చితంగా ఒరిజినల్ ధువ పత్రాలతో హాజరు కావాలని, నోటిఫికేషన్ వచ్చిన తర్వాత జారీ చేసిన లేటెస్ట్ కుల ధృవీ కరణ సర్టిఫికెట్, నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు. వాటితో పాటు ఆధార్, స్టేజ్ -2, స్టడీ, మార్క్ లిస్ట్, అన్ని ఒరిజినల్ సర్టిఫి కెట్స్, జిరాక్స్ సర్టిఫికెట్లు అటెస్ట్ చేసినవి తప్పనిసరిగా తీసుకుని రావాల న్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి కె.ప్రకాష్ బాబు, ఎఆర్ అడిషనల్ ఎస్పి బి. రమణయ్య, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థి

పెన్షన్ పంపిణీలో
సచివాలయ ఉద్యోగి చేతివాటం

- సస్పెండ్ చేసిన మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు మున్సిపాల్టీ పరిధిలోని 19. 20 వార్డు సచివాలయంలో సచివాలయ మహిళా కానిస్టేబుల్ భారతి బాయి చేతి వాటం ప్రదర్శించారు. వృద్ధాప్య పింఛనుకు రూ. 300, వికలాంగుల పింఛనుకు రూ. 600 వసూలు చేయడంతో బాధితులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె వార్డులో 46 పింఛన్లను పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలోనే పింఛనుదారులు ప్రతి ఒక్కరూ తనకు రూ. 300 ఇవ్వాలని లేని పక్షంలో వెరిఫికేషన్‌లో తొలగిస్తానని వారిని భయపెట్టడడంతో బాధితులు మీడియా వివరించారు. ఈ విషయం సోషల్ మీడియా ద్వారా కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆమెను వెంటనే సస్పెండ్ చేయాని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డిని ఆదేశించారు. స్పందించిన కమిషనర్ ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నియమ నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్బడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సైకాలజీ పరిశోధకురాలు ఝాన్సీరాణికి డాక్టరేట్

ప్రజాశక్తి - కడప అర్బన్



యోగివేమన యూనివర్సిటీ సైకాలజీ శాఖ స్కాలర్ ఎం.ఝాన్సీ రాణికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈమె మనో విజ్ఞాన శాస్త్ర శాఖ సహ ఆచార్యులు డాక్టర్ కె.లలిత పర్యవేక్షణలో 'కాగ్నిటివ్స్ స్టిములేషన్ అమాంగ్ ఓల్డర్ పీపుల్ విత్ నార్మల్ కాగ్నిటివ్ ఫంక్షన్ అండ్ మైల్డ్ కాగ్నేటివ్ ఇంపైర్మెంట్ ఎఫికసి ఆఫ్ కాగ్నిటివ్స్ స్టిములేషన్ థెరపీ' అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని వైవీయూకు సమర్పించారు. నిపుణుల బృందం పరిశోధన గ్రంథాన్ని అధ్యయనం చేసి డాక్టరేట్ అర్హత ఉన్నట్లు ప్రకటించారు. వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కె.ఎస్.వి. కృష్ణారావు నోటిఫికేషన్ జారీ చేశారు. ఝాన్సీ రాణి రాసిన పరిశోధన పత్రాలు స్కోపస్, యూనివర్సిటీ గ్రాండ్ కమిషన్ (యూజీసీ) కేర్ లిస్ట్ లోని జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఈమె విజయవాడ గన్నవరంలోని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్‌లో క్లినికల్ సైకాలజిస్ట్‌గా పనిచేస్తున్నారు. డాక్టరేట్ పొందిన సందర్భంగా ఝాన్సీ రాణిని వైవీయూ విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పుత్త పద్మ, సైకాలజీ శాఖ విభాగాధిపతి డాక్టర్ వి.లాజర్, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

కలెక్టర్‌కు కార్యదర్శి హోదా

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు ఉద్యోగోన్నతి లభించింది. రాష్ట్రప్రభుత్వం మంగళవారం రాష్ట్రంలోని నలుగురు సీనియర్ ఐఎఎస్ అధికారులకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ జీవో జారీ చేసింది ఇందులో కలెక్టరుకు ప్రమోషన్ వచ్చినప్పటికీ కడప కలెక్టర్‌గానే కొనసాగుతారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

వైవీయూలో ముందస్తు సంక్రాంతి సందడి

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయంలో కొత్త సంవత్సరం సంక్రాంతి సంబరాలను మోసుకొచ్చింది. వైవీయూ గురుకుల ప్రాంగణం ముత్యాల ముగ్గులు, గొబ్బెమ్మలతో అలరారగా, యువకులు ఉత్సాహంగా ఉట్టికొట్టడంలో పోటీ పడగా, సాంప్రదాయ కోలాటాలు, హరిదాసు సంకీర్తనలతో విశ్వవిద్యాలయంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు కన్నుల పండుగ సాగాయి. వాణిజ్య శాస్త్ర ఆచార్యులు విజయభారతి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా, విశిష్ట అతిథిగా ప్రిన్సిపల్ ఎస్. రఘునాథరెడ్డి హాజరై ప్రారంభించారు. పిల్లలను ఆశీర్వదించి, బోగి మంటలు, సంక్రాంతి లక్ష్మీకి పూజచేసి పండుగను ఆహ్వానించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ తెలుగు ప్రజలకు సంక్రాంతి ప్రీతికరమైన పండుగ అన్నారు. సంక్రాంతి రైతుల పండుగ, పండించే నవధాన్యాలు ఇంటికి చేరుతాయని తెలిపారు. అందుకు కృతజ్ఞతగా రైతులు సంక్రాంతి, కనుమ పండుగలు చేసుకుంటానని చెప్పారు. అధికారులు,విద్యార్థులు, అధ్యాపకులు ఉట్టి కొట్టడంతో పోటీ పడ్డారు. విద్యార్థులు ఉత్సాహంగా గాలిపటాలను వదిలారు. విద్యార్థినిలు ముగ్గులు వేయడంతో పోటీపడ్డారు. గ్రామీణ సాంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను పరిచయం చేస్తూ వేడుకలు కొనసాగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉట్టి కొడుతున్న విసి కృష్ణారెడ్డి


తల్లం ప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్

పాత్రికేయుడిగా తల్లం ప్రసాద్ సేవలు మరువలేనివి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

పాత్రికేయుడిగా విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో ఇటీవల మృతిచెందిన తల్లం వెంకట నాగ ప్రసాద్ సేవలు మరువలేనివని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. మైదుకూరులోని టిటిడి కల్యాణ మండపంలో మంగళవారం తల్లం ప్రసాద్ సంతాపసభను మిత్ర బృందం సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిత్యం కథనాలు రాస్తూ అందరి అభిమానాలను పొందిన వ్యక్తి ప్రసాద్ అని కొనియాడారు. అవసరమైనప్పుడు తనకు కూడా ప్రసాద్ సూచనలు చేసేవారని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ ఇబ్బందులు పడుతూ డయాలసిస్ సెంటర్ మైదుకూరులో ఏర్పాటు చేయాలని సూచించేవారన్నారు. ఆ మేరకు మైదుకూరులో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపగా, ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. సంతాప సభ ఏర్పాటు చేసిన సీనియర్ పాత్రికేయుడు నందిరెడ్డి నాగిరెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. నియోజకవర్గ పరిధిలోని పాత్రికేయులకు ఎల్లవేళలా అండ ఉంటానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కేంద్రం నుంచి పలు మీడియా ప్రతినిధులు, మైదుకూరు మునిసిపల్ ఛైర్మన్ మాచనూరు చంద్ర, కెసి కెనాల్ ప్రాజెక్టు వైస్ ఛైర్మన్ డి.గురివిరెడ్డి, మాజీ జడ్పిటిసిలు మేకల బాబు, గుడిపాడు బాబు, టిడిపి చాపాడు మండల శాఖ అధ్యక్షులు అన్నవరం సుధాకర్ రెడ్డి, బోరెడ్డి వెంకట రమణారెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనపాల జగన్, ఎపి రవీంద్ర, కొండపల్లి ఉమాకాంత్, సీనియర్ పాత్రికేయులు ఎం.విజయభాస్కర్‌రెడ్డి, పెరుగు కృష్ణయ్య యాదవ్, నియోజకవర్గ పరిధిలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌బిఐ రుణాలు మంజూరు

ప్రజాశక్తి - తొండూరు

స్థానిక మహిళా శక్తి భవన్‌లో మంగళవారం ఎస్‌బిఐ పులివెందుల పరిధిలో రూ.కోటి 30 లక్షలు మంజూరు చేసింది. ఆ మేరకు మంజూరైన ఉత్తర్వులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎపిఎం వెంకట్ నారాయణ, సిసిలు వీర మోహన్, జిలాన్ బాషా, ఆంజనేయులు, మండల సమైక్య కార్యదర్శి వసంతకుమారి, గ్రామ సంఘ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి రుణాలు : ఎపిఎం

ప్రజాశక్తి - వేముల

డ్వాక్రా సంఘాల సభ్యుల జీవనోపాధుల మెరుగుదలకు రూ.9 కోట్ల 42 లక్షల రుణాలను అనుసంధానం చేశామని వెలుగు డిఆర్‌డిఎ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆంజనేయులు తెలిపారు. మండల వ్యాప్తంగా పలు బ్యాంకుల సంబంధించి మంజూరైనా రుణాలను పిల్లలకు తర్వాత డ్వాక్రా సభ్యులకు అందజేయాలని బ్యాంకు మేనేజర్లను కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల జీవనోపాధి మెరుగుదలకు అదనపు వనరుల సేకరించడమేనని, చిరు వ్యాపారాల నిర్వహణకు బ్యాంకుల ద్వారా వ్యక్తిగత రుణాలను 100 మందికి మంజూరు చేశామన్నారు. అర్హత, అవసరం ఉన్న ప్రతి మహిళ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రుణాలు సద్వినియోగం, తిరిగి చెల్లింపులు విధానాల్లో డ్వాక్రా మహిళలకు అవగాహనా పెంచడానికి మండలంలోని డ్వాక్రా లీడర్లు, గ్రామ సమాఖ్య కార్యవర్గం సభ్యులు, గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు కృషి చేయాలని సూచించారు. కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు హరికృష్ణ, జయపాల్, జ్యోతి, గంగరాజు పాల్గొన్నారు.


పింఛన్లు తొలగించేదిలేదు

ప్రజాశక్తి- ఎర్రగుంట్ల

పింఛన్లు తొలగిస్తారని కొందరు ప్రచారం చేస్తున్న నేపథ్యంలో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు ఎంపిడిఒ వెంకటరమణయ్య స్పందిస్తూ అర్హులకు పింఛన్లు తొలగించేదిలేదని తెలిపారు. మండలంలోని వలసపల్లె, తుమ్మలపల్లె గ్రామాల్లో ఎంపిడిఒ వెంకటరమణయ్య మంగళవారం పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా 5,300 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. సచివాలయ సిబ్బంది ద్వారా సకాలంలో పింఛను పంపిణీ చేస్తున్నామని వివరించారు. చిలంకూరు, తిప్పలూరు, పోట్లదుర్తి, మాలెపాడు, చిన్న దండ్లూరు, కలమల్ల గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలు లేరని ఇన్‌ఛార్జిలకు బాధ్యత అప్పగించామన్నారు. సచివాలయ సిబ్బంది స్థానిక ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో 90 శాతంపైనే ఇంటి పన్ను సకాలంలో వసూలు అవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వలసపల్లె, తుమ్మలపల్లె గ్రామాల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని కలిసిన టిడిపి నాయకులు

సింహాద్రిపురం : జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర బిసి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి సవితను మంగళవారం మర్యాదపూర్వకంగా తుంగభద్ర ప్రాజెక్ట్ హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, లింగాల మండల టిడిపి నాయకుడు ధనుం జయ నాయుడు కలిశారు. మంగళవారం పెనుగొండలోని మంత్రి నివాసంలో కలిసి పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా తుంగభద్ర ప్రాజెక్టు హై లెవెల్ కెనాల్ పరిధిలో చేపట్టాల్సిన పనులు, ఇతర వాటిపై చర్చించారు. చివరి ఆయకట్టు వరకు నీటిని అందించేందుకు తీసుకోవాల్సిన అంశాలపై మంత్రికి జోగిరెడ్డి వివరించారు. అనంతరం శాలువా కప్పి మంత్రిని సత్కరించారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులు కష్టపడి చదవాలి

వేంపల్లె : విద్యార్థులు కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్తు ఉంటుందని వైసిపి నేత బాబా షరీఫ్, ఎంపిటిసి రహమతుల్లా ఖాన్ పేర్కొన్నారు. మంగళ వారం ఉర్దూ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు మోడల్ ఎస్ఎస్‌సి టెస్ట్ పేపర్స్-2025 పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది విద్యార్థులకు మోడల్ టెస్టు పేపర్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రూరల్ ఎస్ఐకి కౌన్సెలింగ్ అవసరం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇతర పోలీస్ అధికారులు విధులు నిర్వహిస్తున్నప్పటికీ కేవలం ఎస్ఐ మహమ్మద్‌రఫీ మాత్రమే వివాదాస్పదంగా తయారవుతున్నారని, ఆ విషయంలో పోలీస్ జిల్లా ఉన్నతాదికారి దృష్టి పెట్టి కౌన్సెలింగ్ చేయాల్సిన అవసరం ఉందని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఐ మహమ్మద్‌రఫీపై జరిగిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తు న్నామన్నారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళితే అతని బాధను ఆలకించకుండా ఏకపక్షంగా మాట్లాడుతారని ఆరోపించారు.

మానసిక దాడి సరికాదు

ప్రజాశక్తి - వేంపల్లె

అంబేద్కర్ సేవా సమితి ఛైర్మన్ బందెల రామాంజనేయులుపై బిజెపి నాయ కులు మానసిక దాడి చేయడం సరికాదని దళిత సంఘాల నాయకులు ఇల్లూరు పుల్లయ్య, నాగన్న, కమతం రాజా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి దళిత నాయకులు నివాళులర్పించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంటులో డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై హాస్యాస్పదమైన పదజాలం ఉపయోగించిన సందర్భంలో ఆయా సంఘాల నేతలతో కలిసి రామాంజనేయులు నిరసన వ్యక్తం చేశారని చెప్పారు. బిజెపి నాయకులు ఉపాధ్యాయుడైన రామాంజనేయులు నిరసనలో పాల్గొని అమిత్ షాపై ఆరోపణలు చేశాడని ఫిర్యాదు చేయడం తగదన్నారు. సమా వేశంలో ఖాదర్ బాషా, చీకటి భాస్కర్, ఈశ్వరయ్య, గొంగటి శేఖర్, బాషా పాల్గొన్నారు.

విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించొద్దు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించ వద్దని కోరుతూ ఆర్‌టిపిపి పవర్ హౌస్ గేటు వద్ద మంగళవారం ప్లకార్డులు పట్టుకొని స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. చండీగఢ్, ఉత్తరాంచల్, దక్షిణాంచల్ ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ సంస్థలను ప్రయివేటీకరించనున్న నేపథ్యంలో వ్యతిరేకిస్తూ విద్యుత్ సంఘాలు దేశవ్యాప్త నిరసనలో భాగంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్ట్రగుల్ కమిటీ ప్రధాన కార్యదర్శి సుబ్బిరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సంస్థలకు ఉన్న రూ.85 లక్షల కోట్ల ఆస్తులను ప్రయివేట్ సంస్థలకు, వ్యక్తులకు కట్టబెట్టడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. హరియానా, పంజాబ్‌కు ఉమ్మడి రాజధానిగానున్న కేంద్ర పాలిత ప్రాంతం చండీగఢ్‌లో లాభాల్లో ఉన్న విద్యుత్ సంస్థను ప్రయివేట్ పరం చేయాల్సిన అవసరం కేంద్రానికి ఏమిటని ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్‌లో ఉన్న రెండు విద్యుత్ ఉత్పత్తి సంస్థలను ప్రయివేట్ పరం చేయొద్దని స్థానికులు ఆందోళనలు చేస్తున్న యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం వేగంగా ఆదిశగా పావులు కదుపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయివేట్ పరమైతే విపరీతంగా విద్యుత్తు రేటును పెంచుతారని తెలిపారు. వెంటనే ఆ ప్రయత్నాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ నాయకులు పి.వెంకటస్వామి, జెఆర్ మోహన్, హరి ఓబులరెడ్డి, శేఖర్, హమీద్, చిన్నారెడ్డి, గిరిబాబు, గంగయ్య, నాగేంద్ర, వెంకట్, పుల్లారెడ్డి, రాజు పాల్గొన్నారు.


ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న స్ట్రగుల్ కమిటీ నాయకులు

తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పిల్లలు చదువుకునేందుకు ఇంటి వద్ద తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని ఎంఇఒ, జడ్‌పిహెచ్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులురెడ్డి సూచించారు. మంగళవారం పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి ఆయన మాట్లాడారు. ముఖ్యంగా పిల్లలు సెల్‌ఫోన్‌తో సమయం వృథా చేస్తున్నారని తెలిపారు. సెల్‌ఫోన్లకు వారిని దూరంగా ఉంచాలన్నారు. తెల్లవారు జాము 5 గంటలకు వారిని నిద్రలేపి చదువుకునేందుకు కూర్చోబెట్టాలన్నారు. రాత్రి 10 గంటల వరకు విద్యార్థులను చదివించాలన్నారు. స్థానికంగా 745 మంది విద్యార్థులు ఉన్నారని, టెన్త్ క్లాసులో 169 విద్యార్థులున్నట్లు తెలిపారు. తెలుగు, హిందీ బోధించే ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. పిఎంసి కింద పాఠశాల ఎంపికైందని, ఈ పథకంలో క్రీడా మైదానంతోపాటు స్కూల్‌లో పలు అభివృద్ధి పనులు జరుగుతాయని తెలిపారు. క్రీడా మైదానంలో వేదిక ఏర్పాటుకు, స్కూల్‌లో సైకిల్ షెడ్డు, వరండాలో 50 చదరాలు ఫ్లోరింగ్ దాతల సహకారంతో వేయించామని తెలిపారు. ఎన్నారై పూర్వ విద్యార్థుల సహకారంతో తాగునీటి నిమిత్తం మినరల్ వాటర్ ప్లాంటును స్కూల్‌లో ఏర్పాటు చేయించామని ఆయన తెలిపారు. స్కూలు అసిస్టెంట్ ఉర్దూ ఉపాధ్యాయులు గౌస్ బాషా ఖాదిరి రూ.80వేలు సొంత డబ్బుతో సౌండ్ సిస్టం, స్కూల్‌లో ఫ్యాన్లు, కుట్టుమిషన్లను రిపేరు చేయించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహులు, చంద్రఓబులరెడ్డి పాల్గొన్నారు.


తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఇఒ రామాంజనేయులురెడ్డి

వెలుగులోకి సదాశివ రాయల కాలం నాటి కోనేరు



పజాశక్తి - చాపాడు

శేషాచల కొండల్లోని మద్దిమడుగు బీట్ సిద్ధమల్లేశ్వర కోనలో ఉన్న క్రీస్తుశకం 14 శతాబ్దపు సదాశివ రాయల కాలం నాటి బావి, కోనేరును వెలుగులోకి తెచ్చినట్లు మంగళవారం రచయిత, చరిత్ర పరిశోధకులు బొమ్మిశెట్టి రమేష్ తెలిపారు. సిద్ధ మల్లేశ్వర కోనలో తూర్పు వైపు కొండ పైన సిద్ధమలేశ్వర దేవాలయం ఉండేదని, ప్రస్తుతం అది పూర్తిగా ఆనవాళ్లు లేకుండా పోయిందని ఆయన చెప్పారు. దేవాలయ ఆనవాళ్లకు సంబంధించి నంది విగ్రహం ఉండేదన్నారు. గుప్త నిధుల కోసం కొందరు దుండగులు ఆ నంది విగ్రహాన్ని బావిలో పడేశారని వివరించారు. నంది విగ్రహాన్ని బయటకు తీయడం కష్టమవుతోందన్నారు. పురాతన కాలంలో సిద్ధమల్లేశ్వర స్వామి దేవాలయ ప్రదేశం నుంచి 6 కిలోమీటర్లు ప్రయాణించి ప్రసిద్ధి చెందిన పొలతల క్షేత్రాన్ని భక్తులు చేరుకునేవారని తెలిపారు. తనకు ఈ విషయాల గురించి కొలుములపల్లి పంచాయతీ లింగారెడ్డిపల్లెకు చెందిన నాగ మల్లారెడ్డి అనే వ్యక్తి సమాచారం ఇవ్వడంతో పరిశోధన చేశానని రమేష్ విశదీకరించారు. 2024 మే 19న నాగ మల్లారెడ్డి మరి కొంతమంది యువకులతో కలిసి ఈ బావి, కోనేరులను శుభ్రపరిచి అడవిలోని జంతువులకు దాహార్తిని తీర్చారని ఆయన తెలిపారు. కడప నుంచి గువ్వల చెరువుకు పోయే రహదారిలోని జమాల్ పల్లి దాటిన తర్వాత ఎన్‌టిపిసి వస్తుంది. దీనికి ఎదురుగా ఉన్న గురుగుంపు (పూర్వకాలంలో గుర్రం గుంపు అని పిలిచేవారు) పంచాయతీలోని సుగాలితండా మీదగా 6 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేస్తే సిద్ధమల్లేశ్వర కోనకు చేరుకోవచ్చని రమేష్ తెలిపారు.

గిట్టుబాటు ధర లభించకనే ఆత్మహత్యలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవడంతోనే దిద్దేకుంట గ్రామంలో నాగేంద్ర కుటుంబ సభ్యులు ఆత్మహత్యకు పాల్పడ్డారని రాష్ట్ర కౌలు, రైతు సంఘం నాయకులు రాజారాంరెడ్డి, బాల రంగయ్య పేర్కొన్నారు. దిద్దేకుంట గ్రామంలో కె నాగేంద్ర, భార్య వాణి, కుమారుడు భార్గవ్, కూతురు గాయత్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై మంగళవారం వారు కుటుంబ సభ్యులు, తల్లి సిద్ధమ్మను విచారించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం నాగేంద్ర చేసిన అప్పులను చెల్లించి తాకట్టులో ఉన్న పొలాన్ని, ట్రాక్టరును విడిపించి తన తల్లి అయిన సిద్ధమ్మకు రూ.20లక్షలు ఆర్థిక సాయం చేయాలన్నారు. అప్పులపాలవుతున్న రైతు కుటుంబాలను ఆదుకోవడానికి రైతు రుణమాఫీ చేయాలన్నారు. బ్యాంకుల ద్వారా కొత్త అప్పు లు ఇప్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటలకు గిట్టు బాటు ధర చట్టం చేయాలన్నారు. రైతు సంఘం మండల కమిటీ సభ్యులు జయ శేఖర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఆదిరెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కడప జిల్లాలో స్టీల్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సిపిఎం కార్యదర్శి సత్యనారాయణ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగ ళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో బిజెపి మూడోసారి అధికారంలోకొచ్చి విభజన హామీలను నెరవేర్చక పోవడం బాధాకర మన్నారు. కడప ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతో ఉప కరించే ఉక్కు కర్మా గారాన్ని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ప్రస్తుతం జిల్లాలో వ్యాపారాలు లేక, ఉపాధి దొరక్క విద్యాధికులు, పనులు లేక ప్రజలు అల్లాడి పోతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయడం చాలా అవసరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నదుల అనుసంధానంపై ఉంచిన శ్రద్ధ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుపై కూడా పెట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభాత్వాలపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు పాటుపడాలన్నారు. జనవరి 4న కడపలో జరిగే సిపిఎం జిల్లా మహాసభల్లో స్టీల్‌ప్లాంట్ అజెండాగా చేర్చి ఆందోదోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సిపిఎం నాయకులు శేఖర్, చెన్నారెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సత్యనారాయణ

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఈనెల 4,5 తేదీల్లో కడప నగరంలో జరగనున్న సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.మనోహర్ కోరారు. మంగళవారం మస్టర్ పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ గఫూర్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. జిల్లా సిపిఎం ఆధ్వర్యంలో కడపలో జరిగే 12వ మహాసభలు రెండురోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. సిపిఎం పట్టణ కార్యదర్శి జి.ఏసుదాసు, కమిటీ సభ్యులు ఎ.వినయ్‌కుమార్, కమల్ బాషా పాల్గొన్నారు.

మినుములో పల్లాకు తెగులు నివారణ చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

మినుము పంటలో పల్లాకు తెగులు నివారణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఎఒ వెంకట కృష్ణారెడ్డి రైతులకు సూచించారు. చింతకుంట గ్రామంలో ఆహారం, పోషకాల భద్రత, జాతీయ మిషన్ వంటనూనెలు, నూనె గింజలు, పప్పు దినుసుల అభివృద్ధి పథకం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎఒ మినుము పంటలో శిక్షణా కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ మినుము పంటలో పల్లాకు, లీఫ్ క్రింకిల్ తెగులును అరికట్టే విధానం, నివారణ చర్యల గురించి వివరించారు. ముఖ్యంగా పల్లాకు తెగులు సోకిన మొక్కలను పొలంలో గమనించి వెంటనే ఏరి కాల్చడం, గుంతలో పూడ్చివేసి మట్టి కప్పి వేయాలన్నారు. రసం పీల్చే పురుగుల ఉధృతి అధికమైనప్పుడు ఈ తెగులు వ్యాప్తి చెందుతుందన్నారు. రసం పీల్చే పురుగులైన తెల్లదోమ, పచ్చదోమ, దీప పురుగుల నివారణ కోసం ఒక ఎకరంలో 8 నుండి 10 చొప్పున పసుపు రంగు జిగురు అట్టలు పంట కంటే ఒక్క అడుగు ఎత్తులో ఏర్పాటు చేయాలన్నారు. విత్తే ముందు విత్తనశుద్ధి చేస్తే తెగులు వ్యాప్తి చెందకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.


పంటను పరిశీలిస్తున్న ఎఒ వెంకటకృష్ణారెడ్డి


వీల్‌చైర్లు అందజేస్తున్న అధికారులు

విభిన్నప్రతిభావంతులకు వీల్ ఛైర్స్ పంపిణీ

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక మెయిన్ బజార్‌లో ఉన్న భవిత కేంద్రంలో విభిన్నప్రతిభావంతుల చిన్నారులకు మంగళవారం వీల్ ఛైర్స్ పంపిణీ చేసినట్లు ఎంఇఒ జాఫర్ సాదిక్ పేర్కొన్నారు. ఎంఇఒ జాఫర్ సాదిక్, కడప రూరల్ డెవలప్‌మెంట్ ఫర్ యూత్ వెల్ఫేర్ సమితి అధ్యక్షులు నజీమ్ అహ్మద్, మాజీ జడ్‌పిటిసి సభ్యులు డాక్టర్ ఎస్ఎఫ్ బాషా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిత కేంద్రంలో పిల్లలకు అవసరమైన ఉపకరణాలను దాతల సహకారంతో భవిత కేంద్ర సిబ్బంది సమకూర్చిందని తెలిపారు. భవిత సెంటర్‌లో పనిచేస్తున్న కేర్ టేకర్ సుజాత భర్త మృతి చెందడంతో దాతల సహకారంతో రూ.56,750 సేకరించి అందజేశామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉషారాణి భవిత కేంద్రంలోని చిన్నారులకు ఐడి కార్డులను అందించారు. అనంతరం విద్యార్థులకు అతిథి భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐఇఆర్‌టిలు యశోద, సుజాత, ఖాదర్, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - తొండూరు

తొండూరు ఉన్నత పాఠశాల 62వ వార్షికోత్సవ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం పాఠశాల వ్యవస్థాపకులు మఠం గంగిరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సభావేదికను దాత, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బి.వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు. సాయంత్రం పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రాంగణం కళకళలాడింది. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.



పాఠశాల వార్షికోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు


పారిశుధ్య పనులు చేపడుతున్న పంచాయతీ సిబ్బంది

గుంతచియ్యపాడులో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని గుంత చియ్యపాడు గ్రామంలో మంగళవారం అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. సోమవారం 'ప్రజాశక్తి'లో 'పారిశుధ్యం-అధ్వానం' అనే శీర్షికను కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అధికారులు వెంటనే పారిశుధ్య పనులు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి సుధాకర్ గ్రామంలో మురికి గుంతల్లో పూడికతీత పనులు చేపట్టారు. వీధుల వెంబడి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. రోడ్లపైకి గృహ అవసరాలకు వినియోగించిన నీటిని వదలకూడదని ప్రజలకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న చక్రపాణిరెడ్డి

చెస్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె

ఎపి రాష్ట్ర రాంకింగ్ చెస్ టోర్నమెంట్‌లో వేంపల్లెకు చెందిన శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి చెప్పారు. మంగళవారం చెస్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన అభినందించారు. అండర్-14 విభాగంలో తలారి తనుశ్రీ, అండర్-16 విభాగంలో తలారి కౌశిక్ ప్రతిభ చాటినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపడంతో ఈ ఏడాదిలో జరిగే జరిగే 13వ జాతీయ స్థాయి స్కూల్ రాంకింగ్ చెస్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు చెప్పారు. రాంకింగ్ చెస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతిని కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి అందజేశారు. జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ చూపాలని కోరారు. పాఠశాల డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, చైతన్య రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు

స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో 2025వ నూతన సంవత్సర వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. 2024లో జరిగిన సంఘటనలను విద్యార్థులకు ఆ పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. పోయిన రోజులను కూడా మంచి రోజులుగా గుర్తించుకోవాలని కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి సూచించారు. 2025లో సంతోషంగా ఉండేలా ప్రతి ఒక్కరూ ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శనలుతోపాటు సృజనాత్మక వేషధారణలు వేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు చేతన్ రెడ్డి, చైతన్య రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు సాద్ ఇర్ఫాన్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పట్టణానికి చెందిన యువ క్రికెటర్ సికిలిగిరి సాద్ ఇర్ఫాన్ జాతీయ స్థాయిలో జరిగే క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్ర స్థాయిలో స్కూల్ గేమ్స్ క్రికెట్ అండర్-14 కేటగిరిలో సాద్ ఇర్ఫాన్ ప్రతిభ చాటారు. గత నవంబర్ 28, 29, 30 తేదీల్లో జరిగిన అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో ఓపెనింగ్ బ్యాట్స్‌మ్యాన్‌గా బరిలోకి దిగిన సాద్ ఇర్ఫాన్ తన అద్భుతమైన ఆట తీరుతో కడప జిల్లా జట్టు విజయానికి ప్రధాన పాత్ర పోషించాడు. డిసెంబర్ 30న జరిగిన ప్రాబబుల్స్ పోటీల్లో చక్కటి నైపుణ్యాన్ని ప్రదర్శించి సాద్ ఇర్ఫాన్ ఆంధ్రప్రదేశ్ జట్టులో స్థానం సంపాదించారు. జనవరి నెలలో ముంబై, పాట్నాలో జరిగే జాతీయస్థాయి క్రికెట్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరుపున ఇర్ఫాన్ పాల్గొననున్నారు. రాహుల్ ద్రావిడ్, వివిఎస్ లక్ష్మణ్, మహమ్మద్ అజారుద్దీన్ ఆటగాళ్లలా క్రికెటర్లు నైపుణ్యాన్ని ప్రదర్శించాలని పలువురు సాద్ ఇర్ఫాన్‌ను అభినందించారు. సాద్ ఇర్ఫాన్ క్రికెట్‌లో మరింత రాణించి ప్రొద్దుటూరుకు మంచి పేరు తేవాలని పుర ప్రజలు కోరుతున్నారు.


సాద్ ఇర్ఫాన్

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో కార్మికుడు మృతి

ప్రజాశక్తి - వేముల

స్థానిక తుమ్మలపల్లి వద్దనున్న యురేనియం కర్మాగారంలోని ప్రధాన కాంట్రాక్టర్ ఎస్ఎంఎస్ సబ్ కాంట్రాక్టర్ నంది కంపెనీలో పనిచేస్తున్న విశ్వజిత్ సాహు (25)అనే కార్మికుడు నంది కాంట్రాక్టర్ మహేశ్వర్‌రెడ్డి మబ్బు చింతలపల్లె తోటలో అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకొని మృతి చెందాడు. సమాచారాన్ని తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మృతిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తోటి కార్మికుల మాటల ప్రకారం.. నంది కంపెనీలో పనిచేస్తున్న వంట మాస్టర్, చనిపోయిన విశ్వజిత్, మరో వ్యక్తి గత గురువారం గొడవ పడినట్లు తెలుస్తోంది. గొడవపడిన తర్వాత ముగ్గురిని కాంట్రాక్టర్ మహేశ్వర్‌రెడ్డి చితకబాదినటు ఆరోపిస్తున్నారు. అవమాన భారంతో విశ్వజిత్ నాలుగు రోజులుగా ఉంటూ.. సోమవారం నంది కంపెనీ సూపర్‌వైజర్ విశ్వజిత్‌కు ఫోన్ చేసి డ్యూటీకి రాలేదా అని అడగ్గా తనకు కొంచెం నొప్పులు ఉన్నాయ్ ఈ రోజు రాలేను అని సమాధానం చెప్పినట్లు సమాచారం. మంగళవారం కాంట్రాక్టర్ మహేశ్వర్‌రెడ్డి తోటలోని వేపచెట్టుకు ఉరి వేసుకొని ఉండడం తోటి కార్మికుడు గమనించి అధికారులకు సమాచారం ఇచ్చాడు. అధికారులు ఉరి వేసుకున్న విశ్వజిత్‌ను పరిశీలించి పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ మృతదేహన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల సర్వజన ఆసుపత్రికి తరలించారు. విశ్వజిత్ మృతిపై ఆయన కుటుంబసభ్యులు పలు సందేహాలను వ్యక్తం చేశారు. సమగ్ర దర్యాప్తు చేయాలని మృతుడి తండ్రి వికాస్ కుమార్ సాహు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ విలేకరుల సమావేశంలో వివరించారు.


మృతి చెందిన విశ్వజిత్ సాహు

కుందూలో వృద్ధుడు గల్లంతు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని గుంతచియ్యపాడు గ్రామానికి చెందిన తమ్మిశెట్టి సుబ్బరాయుడు అనే వృద్ధుడు ప్రమాదవశాత్తు కుందూ నదిలో పడి గల్లంతయిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు పోలీసులు జాలర్లతో వెతకడం ప్రారంభించారు. గ్రామంలో ప్రజలు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు.